క్లుప్తంగా

ఉపాధి హామీ పనులు తనిఖీ


పనులను తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సిద్దవటం : మండలంలోని జంగాలపల్లె ఎస్సీ కాలనీ సమీపంలోని పెద్ద వంకలో ఉపాధి హామీ పథకం కింద జరుగుతున్న చెక్‌డ్యాం పూడికతీత పనులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులు చేసే కూలీల వివరాలను సేకరించామన్నారు. కూలీలు ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు పనులు చేసి వెళ్లిపోవాలన్నారు. వడదెబ్బ తగలకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మంచినీళ్లు ఎక్కువగా తీసుకోవాలన్నారు. పనులు కల్పించిన ప్రదేశాలలో పనులు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ పనికి వచ్చే విధంగా కృషి చేయాలని ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌కు తెలియజేశామన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు పరిశీలన


ఆలయాన్ని సందర్శిస్తున్న ఏసీ విశ్వనాథ్, భక్తులు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లి గ్రామంలోని శ్రీ కోదండరామాలయ పునర్నిర్మాణాన్ని మంగళవారం దేవాదాయశాఖ అన్నమయ్య జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ సందర్శించడం జరిగింది. దేవస్థానంలో ధూపదీప నైవేద్యం కింద అర్చకుని నియమించేందుకు పరిశీలన చేయడానికి, ఆలయంలో జరుగుతున్న పనులను వారు పర్యవేక్షించారు. ఈయన వెంట దేవస్థానం ధర్మకర్త గంపా సుధాకర్, నడివీధి సుధాకర్, ఆకుల చలపతి, నారపుశెట్టి వేణుగోపాల్, నారపుశెట్టి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

చిట్వేలి : చిట్వేలి పీహెచ్‌సీ వైద్యులు అబ్దుల్ అన్సారీ ఆదేశాల మేరకు హెల్త్ ఆఫీసర్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం రాజుకుంట, చింతలచెలిక గ్రామాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా హెచ్‌ఓ వినయ్ కుమార్ మాట్లాడుతూ జ్వర పీడితులు, మోకాళ్లు, కీళ్లనొప్పులతో బాధపడుతున్న వారికి ఈ వైద్య శిబిరంలో రక్త పరీక్షల చేసి చికిత్స అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు నిహారిక, మంజుల, ఏఎన్ఎం ఫరిదా, శాంతకుమారి, ఆశ కార్యకర్తలు బాలమ్మ, సక్కుబాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం


మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సర్పంచ్ జయపాల్ రెడ్డి

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని బొంతవారిపల్లి, పుటికవారిపల్లి గ్రామాలకు చెందిన నిరుపేదలు జవ్వాది లక్ష్మయ్య (45), బియ్యాల రామ్మోహన్ (52)లు గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. సర్పంచ్ ఎన్‌పీ జయపాల్ రెడ్డి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబాలకు తనవంతు సహాయ సహకారాలు అందించి అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మృతుల కుటుంబాలకు ఆయన ఆర్థిక సాయం అందించారు.

నివాళి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని న్యూ కృష్ణానగర్‌లో నివాసం ఉంటున్న విశ్రాంత ప్రిన్సిపల్ రామకృష్ణ (88) మృతి చెందారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పలువురు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. 33 సంవత్సరాలపాటు విద్యారంగానికి అంకితభావంతో పనిచేసిన ఆయన 1980లో రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందారన్నారు. ఆయనకు పలువురు పట్టణప్రముఖులు, రాజకీయ నేతలు నివాళి అర్పించారు.

నడిపేదెట్టా.. నడిచేదెట్టా!


స్పీడ్ బ్రేకర్ అనంతరం ప్రమాదకరంగా ఉన్న గుంత


వాహనదారులను భయపెడుతున్న కుళాయి కోసం తీసిన గుంతలు

- అర కిలోమీటర్ దూరానికి 22 స్పీడ్‌బ్రేకర్లు.. అదనంగా గుంతలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ద్విచక్రవాహనదారులు
- తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న స్థానికులు

రాయచోటి టౌన్ : ఆ దారిలో నిత్యం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రాయచోటి పట్టణంలో ఉన్న విద్యాలయాలలో సగానికిపైగా ఆ దారిలో ఉన్నాయి. అంతే కాదు రాయచోటి నివసించే ఉద్యోగస్తులలో సగం మంది ఆ దారిలోనే తమ స్వగృహాలకు వెళ్లాలి. ఇలా నిత్యం రద్దీగా కనిపించే దారి విద్యార్థులకే కాకుండా ద్విచక్ర వాహనదారులకు నరకం చూపిస్తోంది. ఆ దారే జగదాంబ సెంటర్ మార్గం. ఆర్టీసీ బస్టాండ్ నుంచి మండల పరిషత్ కార్యాలయం మలుపు నుంచి మొదలు మదనపల్లె రోడ్డులోకి వెళ్లే వరకు మొత్తం 22 స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయంటే ఆశ్చర్యం కలుగకమానదు. అవి చాలదన్నట్లుగా అక్కడక్కడ ఎవరికి ఇష్టమొచ్చినట్లు వారు వారి ఇళ్ల ఎదుట నీటి కుళాయిల కోసం తవ్వుకున్న కుళాయి గుంతలు తవ్వేశారు. తరువాత వాటిని పూడ్చాలన్న మాట మరిచినట్లుగా ఉంది. ఈ విషయాన్ని అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చిన్నారులు నడుచుకుంటూ వెళ్లాలన్నా ఇబ్బందులకు గురి చేసేలా ఈ రోడ్డు ఉండటంతో స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీఏ కార్యాలయంలో డ్రైవింగ్ ట్రాక్ కంటే అధికంగా ఈ మార్గంలో స్పీడ్ బ్రేకర్లు ఉండటంతో అవస్థలు పడుతున్నామని వాహనదారులు మండిపడుతున్నారు.


స్పీడ్ బ్రేకర్ వద్ద నిలిచిన మురుగు నీటిని దాటుతున్న సైక్లిస్ట్


జగదాంబ సెంటర్ వద్ద స్పీడ్ బ్రేకర్‌ను దాటుకుంటున్న స్కూటరిస్టులు, పాదచారులు

నిత్యం నరకమే



ఆ దారి నిత్యం నరకమే. స్కూటర్‌పై వెళ్లామంటే నడుములు ఊనాం అవుతాయంతే. కనీసం పది మీటర్లు కూడా సాఫీగా లేదు. అప్పుడే గేర్లు మార్చాలి. అర కిలోమీటరు పోవాలంటే ఇరవై నిమిషాలు పడుతోంది. ఏ స్పీడ్ బ్రేకర్ ఎక్కించేటప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. స్పీడ్ బ్రేకర్లతోనే సతమతమవుతుంటే గుంతలు సైతం ఉండి వాహనాలను నడిపేకి లేకుండా చేస్తున్నాయి. ఈ మార్గంలో ద్విచక్రవాహనంపై అధికారులు వెళితే సగటు వాహనదారుడి అవస్థ తెలుస్తుంది. అధికారులు స్పందించి ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలి.

\- రాజకుమార్ రాజు, న్యాయవాది, రాయచోటి

ప్యాచింగ్స్ వేయడానికి ఏర్పాట్లు చేస్తున్నాం

ఆ దారిలో ఇబ్బందులు ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై గత మీటింగ్ సమావేశంలో ప్రతిపాదనలు పెట్టాం. కొత్తగా రోడ్డు వేస్తే ఆ దారిలోని ఇళ్లు మరింత లోతులోకి పోతాయని అభ్యంతరాలు రావడంతో వాటిపై ప్యాచింగ్‌లు వేయడానికి నివేదికలు రూపొందించాం. నిధులు రూ.10 లక్షలు కేటాయింపు జరిగింది. త్వరలోనే ప్యాచింగ్‌లు వేయించి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

\- ఎన్. వాసుబాబు, రాయచోటి మున్సిపల్ కమిషనర్

ఘనంగా భావనారుషి గ్రామోత్సవం


దర్శనమిస్తున్న భద్రావతి సమేత భావనారుషి

పుల్లంపేట : మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో శ్రీ భద్రావతి సమేత భావనారుషి గ్రామోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్వామివారిని గ్రామ పురవీధులలో ఊరేగించారు. అనంతరం మహిళలు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. కోలాటం, చెక్కభజనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు

నందలూరు : ఈనెల 19వ తేదీ నుంచి 28వ తేదీ వరకు నందలూరు సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మంగళవారం ఎంపీడీఓ రాధాకృష్ణంరాజు తెలిపారు. 0 నుంచి 5 సంవత్సరాలు వారు ఆధార్ కార్డు అప్‌డేట్ చేయుట, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో మార్పు, ఆధార్ కార్డునకు ఫోన్ నెంబరు లింక్, వేలి ముద్రలు అప్‌డేట్ చేయడం జరుగతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్యదర్శి

వీరబల్లి : మండల కేంద్రంలో ఉన్న మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ సర్పంచ్ జయరాణెమ్మ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయం పనిమీద వచ్చిన ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరిద్దాం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హరి

లక్కిరెడ్డిపల్లి : క్షయ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా వారిని ఆదరించాలని క్షయవ్యాధి నివారణ సూపర్‌వైజర్ హరి పేర్కొన్నారు. క్షయవ్యాధి వారోత్సవాలలో భాగంగా మంగళవారం బి.ఎర్రగుడిలో క్షయపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తుడు తుమ్మినా, దగ్గినా గాలి నుంచి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. రెండు, మూడు వారాల నుంచి విడవకుండా జ్వరం, దగ్గు, తలనొప్పి లాంటి లక్షణాలు ఉన్నవారికి వ్యాధి నిరోధక శక్తి తగ్గి క్షయవ్యాధి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్లపరీక్షలు చేయించాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఆరు నెలలకు సంబంధించిన మందులను ఉచితంగా అందిస్తుందన్నారు. అలాగే క్షయ వ్యాధిగ్రస్తులు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం ప్రతి నెల పౌష్టికాహారానికి రూ.1000లు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పక్కాగా భూ రీ సర్వేను చేపట్టాలి


నల్లగుట్టపల్లెలో జరుగుతున్న రీ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్

రామాపురం : భూముల రీ సర్వేను పక్కాగా చేపట్టాలని రాయచోటి డివిజన్ ఆర్డీఓ శ్రీనివాస్ సిబ్బందికి ఆదేశించారు. మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామంలో భూ రీ సర్వే ప్రక్రియను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వేకు సంబంధించిన పూర్తి వివరాలను తహసీల్దార్, మండల సర్వేయర్లను అడిగి తెలుసుకున్నారు. మూడు టీంల జరుగుతున్న సర్వేను త్వరితగతిన తప్పులు దొర్లకుండా పూర్తి చేయించాలని తహసీల్దార్‌కు సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం ప్రగతిపై కలెక్టర్ సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు, తహసీల్దార్ రామాంజనేయులు, ఆర్ఐ సమద్‌ఖాన్, వీఆర్‌ఓలు, వీఆర్ఏలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలి


లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ శివయ్య

లక్కిరెడ్డిపల్లి : నిర్మాణ దశలో అర్ధంతరంగా ఆగిపోయిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ శివయ్య తెలిపారు. మంగళవారం మండలంలోని అనంతపురం, హరిజనవాడ, వడ్డిపల్లి, చౌటపల్లి గ్రామాలలో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో ఆగిపోయిన ఎస్సీ, బీసీ లబ్ధిదారుల ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం అదనంగా రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75వేలు ఇస్తోందన్నారు. పనులు మొదలు పెట్టిన వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. చాలా మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న అదనపు బిల్లులకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఏడాది మంజూరయ్యే ఇళ్లకు రూ. 4.30 లక్షలను ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ జనార్దన్, అసిస్టెంట్ ఇంజనీర్లు అంజి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి


పాడి రైతులకు ఉచిత మందులను అందిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

సుండుపల్లె : ఎండలు అధికంగా ఉన్న కారణంగా పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని వైఎస్ఆర్ కడప జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, అన్నమయ్య జిల్లా పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డా.కె.గుణశేఖర్‌పిళ్లైలు సూచించారు. మండల పరిధిలోని సొంతంవారిపల్లె గ్రామంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ సహకారంతో మంగళవారం పశు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి రైతులు పశువులను చికిత్స కోసం తీసుకువచ్చారు. ఈ వైద్యశిబిరంలో 143 పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు, 4 నెలల నుంచి 8 నెలల వయసులో ఉన్న 25 దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాలు, 47 పశువులకు గర్భకోశ పరీక్షలు, 75 పశువులకు సాధారణ చికిత్సలు, 160 పశువులకు బ్యుటాక్స్‌ను పిచికారీ చేశారు. పశువుల పెంపకదారులకు ఉచిత మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయచోటి ఉపసంచాలకులు డా.డి.కొండయ్య, రమణయ్య, డిప్యూటీ డైరెక్టర్ కడప రంగస్వామి, డిప్యూటీ డైరెక్టర్ విపిసి కడప రాజశేఖర్, డిప్యూటీ డైరెక్టర్ ఏడీడీఎల్ కడప డాక్టర్ సంధ్యారాణి, ఏడీడీఎల్ డాక్టర్ శివరామిరెడ్డి, టి.సుండుపల్లె సహాయ సంచాకులు డా.కె.విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రామాపురం : మండల పరిధిలో ఏపీ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శ్యామలాదేవి తెలిపారు. మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మార్చి 17 నుంచి మే 22వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని, మెరిట్ ఆధారంగా రిజర్వేషన్ ప్రకారం సీట్లు కేటాయిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి


జ్ఞాపికను అందజేస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ఫార్మాడీ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు వీడ్కోలు కార్యకమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డా.స్వర్ణలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు అన్నమాచార్య యూనివర్సిటీ వీసీ డా.సాయిబాబారెడ్డి, ఏఐటీఎస్ వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. దేశ విదేశాలలో ఫార్మసీ విద్యకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

రేపు బహిరంగ వేలంపాట

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలోని బస్టాండ్ గేటు, కాంప్లెక్స్ గదులకు ఈనెల 20వ తేదీ స్థానిక పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ సుదర్శన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 2025 – 26 సంవత్సరానికి గాను బస్టాండు గేటు, కాంప్లెక్స్ గదులకు సంబంధించి వేలం జరుగుతుందన్నారు. వేలంపాటలో పాల్గొనేవారు బస్టాండ్ గేటుకు రూ.లక్ష, గదులకు రూ.20 వేలు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనాలని, పాట దక్కించుకున్న వారు మొత్తం రుసుము చెల్లించి రశీదు పొందాలని వారు తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న తుమ్మల రాధాకృష్ణ

రైల్వేకోడూరు అర్బన్ : మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ పిలుపుమేరకు జరిగే విజయవాడ ధర్నాను విజయవంతం చేయాలని కామ్రేడ్ జయచంద్ర మంగళవారం డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద రూ.3వేలు గౌరవ వేతనంతో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ తుమ్మల రాధాకృష్ణ, యూనియన్ అధ్యక్షురాలు సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మ జాతర నిర్వహణకు సహకరించాలి


మాట్లాడుతున్న పోతురాజు మస్తానయ్య

నందలూరు : భక్తుల సహకారంతో ఏడూర్ల మారెమ్మ జాతరను వైభవంగా జరుపుకుందామని మారెమ్మ ఆలయ ధర్మకర్తల మండలి పిలుపునిచ్చింది. మంగళవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధర్మకర్త మండలి ప్రతినిధులు మాట్లాడారు. నాగిరెడ్డిపల్లి మేజర్ పంచాయతీ గ్రామ దేవత అయిన శ్రీ మారెమ్మ తల్లి గుడి పురాతనమైందన్నారు. దాదాపు 1000 ఏళ్ల కిందటనే ఏడూర్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించేవారని పూర్వీకులు చెబుతుండేవారన్నారు. నారాయణరాజుపేట, అరవపల్లి, గొల్లపల్లి, నాగిరెడ్డిపల్లి, కుమ్మరపల్లి, ఇసుకపల్లి, రాచపల్లి గ్రామాలకు చెందిన వారు ఏకమై ఏడూర్ల మారెమ్మ జాతరను నాగిరెడ్డిపల్లి శివారులో వెలసిన మారమ్మ గుడి వద్ద జరిపేవారని, ప్రస్తుతం అమ్మవారి ఆలయ స్థలం వివాదంలో ఉన్నందున సమస్య పరిష్కారానికి భక్తులు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

వడదెబ్బ రాకుండా జాగ్రత్త పడదాం


విద్యార్థులకు వడదెబ్బపై అవగాహనను కల్పిస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ

రాయచోటి అర్బన్ : వడదెబ్బ గురించి విద్యార్థులందరికి అవగాహన తప్పనిసరి అని హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వడదెబ్బపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ఒంటిపూట బడులను నిర్వహిస్తోందన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉంటూ హోం వర్క్ చేసుకోవాలన్నారు. కాదని ఎండలో క్రికెట్, కోకో, కబడ్డీ, వాలీబాల్ లాంటి ఆటలు ఆడడం వలన వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎక్కువగా జ్వరం రావడం, నీరసంగా వుండడం, కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు, నోరు ఆరిపోవడం, కలవరింతలు, ఉన్నట్లుండి ఆపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలుగా ఆయన తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తులను చల్లని, నీడ ప్రదేశంలోకి తీసుకెళ్లాలని, మెళకువగా ఉంటే ఉప్పు కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగించాలన్నారు. అనంతరం దగ్గరలోని ఆసుపత్రికి తరలించి వైద్యసేవలందించేలా చూడాలన్నారు. ఇవేకాక వడదెబ్బ బారినపడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయ సిబ్బందితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్


సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ వర్కర్లు, టీచర్లు, మహిళా పోలీసులు, అధికారులు

ఒంటిమిట్ట : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన తప్పనిసరి అని కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులపై లైంగిక దాడులు, వేధింపులు, నేరాల నిరోధానికి 2012లో అప్పటి ప్రభుత్వం పోక్సో చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా బాధితులకు రక్షణ, నేరస్తులను పట్టుకోవడమే కాక వారికి వేసే కఠినతరమైన శిక్షలను పొందుపరిచారన్నారు. బాధితులు తమ ఫిర్యాదులను నమోదు చేయడానికి జాతీయ బాలల హక్కుల రక్షణ కమిషన్ (ఎన్‌సీపీసీఆర్) అధికారిక పోర్టల్‌లో పోక్సో ఈ బాక్స్ బటన్ ఉందని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబరు 15100 తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు, ఒంటిమిట్ట సబ్ ఇన్‌స్పెక్టర్ శివ ప్రసాద్, అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు, పారా లీగల్ వలంటీర్లు బాలరాజు శివరాజు, శ్రీదేవి, లీలావతి, ప్రతాప్ రెడ్డి, న్యాయవాదులు, ఎన్జీఓలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.